RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 475 | 20 సెప్టెంబర్ ఆదివారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు

# మంచి పేరు సూచించండి

### : ప్రజలను కోరిన సీఎం రేవంత్



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

**మూడు ప్యాకేజీల్లో పనులు**

విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# తెలంగాణలో మళ్లీ వానలు

### : నేటి నుంచి 24 వరకు భారీ వర్షాలు



వర్షాల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలో నేటి (19వ తేదీ) నుంచి 24వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

బంగాళాఖాతంలో సెప్టెంబర్ 19 సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. ఇది క్రమంగా బలపడి దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్ర తీరాల వైపు కదులుతుందని, దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పుంజుకుంటాయని అంచనా వేసింది. ఈ వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ కొత్త అల్పపీడనంతో ఆ లోటు కొంతవరకు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. నేడు, రేపు.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తర్వాతి రోజుల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ సహా మరిన్ని జిల్లాలకు ఈ హెచ్చరికలు వర్తించనున్నాయి. హైదరాబాద్ నగరంలోనూ సాయంత్రం లేదా రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. రుతుపవనాల తిరోగమనం ఆలస్యమయ్యే సూచనలు ఉన్నాయని, అక్టోబర్ రెండో వారం వరకు వర్షాలు కొనసాగవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# రోడ్డు వేయకపోతే ఓటు వేసే ప్రసక్తే లేదు

### కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు తెగేసి చెప్పిన ప్రజలు



మధ్యప్రదేశ్‌లోని గుణ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి, బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియాకు నియోజకవర్గ ప్రజల నుంచి నిరసన సెగ తగలింది. నియోజకవర్గంలోని ఒక గ్రామానికి వెళ్తున్న ఆయన కాన్వాయ్‌ను ఆపిన స్థానికులు చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డును వెంటనే వేయించాలని డిమాండ్ చేశారు. రోడ్డు వేయకపోతే ఓటు వేయమంటూ ఈ సందర్భంగా ఆయనను హెచ్చరించారు. అయితే ప్రజలు తనను హెచ్చరించిన తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్చరికకు బదులుగా అభ్యర్థన చేయాలని, ఆ పనిని పూర్తి చేసే బాధ్యతను తనకు వదిలేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కాన్వాయ్‌ను చుట్టుముట్టిన ప్రజలు చేతుల్లో ప్లకార్డులు ధరించి 'రోడ్డు వేయకపోతే ఓటు వేయం' అంటూ నినాదాలు చేశారు. 'ఈసారి మీరు ఈ రోడ్డు వేయాల్సిందే. లేకపోతే ఎన్నికల సమయంలో వచ్చి ఓటు అడిగితే మేం వేయబోం' అని కాలనీవాసులు మంత్రికి తెగేసి చెప్పారు. ఇది జరిగిన అరగంట తర్వాత ఒక బహిరంగ సభలో రోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు.

## వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను విపరీతంగా

# ప్రోత్సహించారు

### : కిషన్ రెడ్డి



ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆయన... ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారని ఆరోపించారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని, బీజేపీ శ్రేణులు జరిపిన నిరంతర న్యాయపోరాటం వల్లే ఆయనపై అనర్హత వేటు ముప్పు వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ భూదందాలు, అవినీతిలోనే పోటీపడుతున్నాయని... 'దోచుకోవడం-దాచుకోవడం' తప్ప ప్రజాక్షేమం పట్టడం లేదని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు వారిపై ఏలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇరు పార్టీలు పరస్పరం నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఏ ఎన్నికలకైనా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# కరవులో రైతాంగం..

### దోపిడీలో కూటమి ప్రభుత్వం: పేర్ని నాని



అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.

# కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత



కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు. హుబ్బళ్లిలోని కేఎల్ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ. 700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు. అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు.

అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
20 సెప్టెంబర్ ఆదివారం 2026

# ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పర్యటన

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 19:-**



రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే.. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని.. ఎలాంటి కష్టనష్టాలు లేకుండా భగవంతుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఇబ్రహీంపట్నంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం పట్టణంలోని రహదారుల పరిస్థితిపై ఎమ్మెల్యే దృష్టి సారించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన రోడ్లను అభివృద్ధి చేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినాయక ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే పర్యటనతో మండపాల వద్ద సందడి నెలకొంది. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# గురునానక్ యూనివర్సిటీలో విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 19:-**






ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ తనిఖీల్లో భాగంగా ఇబ్రహీంపట్నం పరిధిలోని పలు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో శనివారం ఉదయం నుంచి అధికారులు సోదాలు, రికార్డుల పరిశీలన కొనసాగిస్తున్నారు. విద్యార్థుల వాస్తవ సంఖ్య, అడ్మిషన్ల వివరాలు, కళాశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా యూనివర్సిటీ రికార్డులు ఉన్నాయా? అడ్మిషన్ల వివరాల్లో ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా? విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలు, రికార్డుల్లో నమోదు చేసిన వివరాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సంబంధిత రికార్డులు, పత్రాలను పరిశీలిస్తూ అధికారులు వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే తనిఖీలకు దారితీసిన కారణాలు, అధికారులు గుర్తించిన అంశాలు, ఎలాంటి అవకతవకలు వెలుగులోకి వచ్చాయనే విషయాలపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# గురునానక్‌లో గ్రాడ్యుయేషన్ సందడి.. 946 మందికి ఉద్యోగాలు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 19:-**




ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ ఇన్స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్‌లో గ్రాడ్యుయేషన్ అండ్ ప్లేస్‌మెంట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1,172 మంది పట్టభద్రులు పాల్గొని డిగ్రీ సర్టిఫికెట్లు, పతకాలు అందుకున్నారు. యూజీ, పీజీ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురు నానక్ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ సర్దార్ తవిందర్ సింగ్ కోహ్లీ స్మారకార్థం 26 బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. ఆన్, ఆఫ్-క్యాంపస్ నియామకాల ద్వారా 169కు పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 946 మంది విద్యార్థులకు నియామక పత్రాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. టీసీఎస్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, డెలాయిట్ తదితర ప్రముఖ సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ము-సిగ్మా సంస్థ ద్వారా అత్యధికంగా రూ.40 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ లభించింది. ముఖ్య అతిథి శ్రీలక్ష్మి కేసరి విద్యార్థులు ఉద్యోగ జీవితంలోనూ నిరంతరం కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గురు నానక్ ఇన్స్టిట్యూషన్స్ వైస్-చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎండీ, వైస్-ఛాన్సలర్ డాక్టర్ హెచ్.ఎస్. సైని బాధ్యత, అంకితభావం, నిరంతర అభ్యాసమే విజయానికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలమాకుల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 19:-**




శంషాబాద్: జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. షాద్‌నగర్‌శంషాబాద్ మార్గంలోని పాలమాకుల గ్రామం, భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మేట్టుగడ్డ తండాకు చెందిన కుటుంబ సభ్యులు వినాయక నిమజ్జనం కార్యక్రమం అనంతరం శంషాబాద్ వైపు ఇన్నోవా వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున సుమారు 2.30 నుంచి 3 గంటల మధ్య టీఎస్ 07 జీజెడ్ 9333 నంబర్ గల ఇన్నోవా వాహనం అదుపుతప్పి ఎన్‌హెచ్-44పై ఎడమవైపు ఉన్న వంతెన నిర్మాణాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కేతావత్ లింబ్యా (54), కేతావత్ జమున (45), కత్రావత్ మాన్‌సింగ్ (48), కేతావత్ వస్రామ్ (45) మృతి చెందారు. డ్రైవర్ సబావత్ అశోక్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ, ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీసులు, ఎన్‌హెచ్‌ఏఐ, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. రహదారి పరిస్థితి బాగానే ఉందని, ప్రమాద స్థలంలో సిమెంట్ బ్లాకులు లేవని, 'నెమ్మదిగా వెళ్లండి' సూచిక బోర్డు ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక పరిశీలనలో వాహనం అధిక వేగంతో ప్రయాణిస్తూ అదుపుతప్పి వంతెనను ఢీకొట్టినట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రమాదానికి దారితీసిన పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# ఈటెల రాజేందర్ తో కలిసి నవజీవన్ రెడ్డి గణేష్ మండపాలలో ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 19:-**




హయత్‌నగర్: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. హైకోర్టు కాలనీ డివిజన్‌లోని కమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంతో పాటు లెక్చరర్ కాలనీలోని బీజేపై యూత్ అసోసియేషన్ మండపం, కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను దర్శించారు. అనంతరం సరూర్‌నగర్‌లోని జ్యోతి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని, బాలాపూర్ గణేష్ విగ్రహాన్ని దర్శించుకున్నారు. అలాగే ఎంఈ గార్డెన్స్‌లో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కళ్లెం నవజీవన్ రెడ్డి ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మండపాల నిర్వాహకులు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బఫర్ జోన్‌లో నిర్మాణంపై ఇరిగేషన్ శాఖ కొరడా



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 19:-**




ఆదిభట్ల: ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని రాందాస్‌పల్లి గ్రామంలో తనరా వ్యాలీ వెంచర్‌లో చేపట్టిన నిర్మాణంపై ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. చెరువు బఫర్ పరిధిలో సుమారు 30 అడుగుల వెడల్పుతో దాదాపు 100 మీటర్ల పొడవున ప్రహరీ నిర్మించారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు స్థలాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులు మరియు నిర్మాణ పరిస్థితిని పరిశీలించినట్లు సమాచారం. నిబంధనలకు అనుగుణంగా లేని నిర్మాణంగా గుర్తించడంతో దానిని తొలగించాలని వెంచర్ నిర్వాహకులకు స్పష్టం చేశారు. అధికారుల ఆదేశాలతో ఇప్పటికే ప్రహరీ తొలగింపు పనులు చేపట్టినట్లు చేపట్టారు. ఇదే సమయంలో బఫర్ పరిధిలో నిర్మాణానికి అనుమతులు ఏ విధంగా లభించాయనే అంశంపైనా అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. వెంచర్ పరిధిలో మరే ఇతర నిర్మాణాలు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయా? సంబంధిత అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# పెన్షనర్ల సేవకు గౌరవం..

## నాంపల్లిలో ఆకట్టుకుంటున్న 'పెన్షనర్ వినాయకుడు'!

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:**




ఉద్యోగుల జీవితకాల సేవకు గౌరవం, పదవీ విరమణ అనంతరం పెన్షన్ ద్వారా లభించే ఆర్థిక భద్రత, ఆత్మగౌరవంతో కూడిన జీవనానికి ప్రతీకగా హైదరాబాద్‌లో కొలువుదీరిన 'పెన్షనర్ వినాయకుడు' అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. నాంపల్లిలోని పెన్షన్ పేమెంట్ ఆఫీస్ (పీపీఓ) ప్రాంగణంలో జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ వినూత్న వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న వినూత్న థీమ్: సంప్రదాయ భక్తి భావానికి ఆధునిక సామాజిక స్పృహను జోడిస్తూ నిర్వాహకులు ఈ థీమ్‌ను తీర్చిదిద్దారు. 'సేవ పదవీ విరమణ పెన్షన్ భద్రత గౌరవప్రదమైన జీవితం' అనే అర్థవంతమైన నినాదాన్ని ప్రతిబింబించేలా ఈ మండప అలంకరణ సాగింది. జీవితాంతం ప్రజా సేవలో తరించి పదవీ విరమణ పొందిన పెన్షనర్ల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ నివాళిగా ఈ విగ్రహాన్ని, సెట్టింగ్‌ను రూపొందించారు.

విఘ్నాలను తొలగించే గణనాథుడు ప్రతి పెన్షనర్‌కు ఆయురారోగ్యాలు, మానసిక ప్రశాంతత, ఆర్థిక సుస్థిరత ప్రసాదించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాక, సామాన్య భక్తులకు సైతం విశేషంగా నచ్చిన ఈ 'పెన్షనర్ వినాయకుడి'ని దర్శించుకునేందుకు నగరవాసులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# జిల్లాస్థాయి క్రీడా బరిలో ఉషోదయ విద్యార్థులు

## - కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో సత్తా..

## - 11 మంది క్రీడాకారుల ఎంపిక




**గీసుగొండ, సెప్టెంబర్ 19, హైదరాబాద్ ఎస్టేట్:**

సంగెంగీసుకొండ జోన్ ఆధ్వర్యంలో సంగెంలో నిర్వహించిన 70వ పాఠశాలల జోనల్ స్థాయి క్రీడా ఎంపిక పోటీల్లో ఉషోదయ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల డైరెక్టర్ గిరిగాని రాహుల్ వర్మ అభినందించారు. కబడ్డీ విభాగంలో శివకుమార్, విష్ణు, రాహుల్, యశ్వంత్, రితిక్ ఎంపిక కాగా, ఖోఖోలో భువన్, అభిరామ్, రితిక్, శివతేజ, వాలీబాల్ విభాగంలో అరవింద్, శశివర్ధన్ జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాహుల్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలనే లక్ష్యంతో పాఠశాలలో ప్రతిరోజూ క్రీడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరంతర శిక్షణకు అనుగుణంగా విద్యార్థులు జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రగిరి మహేష్, వైస్ ప్రిన్సిపాల్ వీరన్న, వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు కుంట విజేందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# పెద్దాపూర్ స్కూల్‌లో పేరెంట్స్ మీటింగ్

## - తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థుల భవిష్యత్తుకు బాట: సర్పంచ్ ఎలకటి రవి




**పెద్దాపూర్, సెప్టెంబర్ 19, హైదరాబాద్ ఎస్టేట్:**

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మడే బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశానికి గ్రామ సర్పంచ్ ఎలకటి రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలకటి రవి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులు విద్యావంతులుగా ఎదిగితేనే సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. పాఠశాలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు గ్రామ పాలకమండలి సహకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు బూట్లు, బెల్టులు, టైలు, బాలికలకు ప్రత్యేక కిట్లు అందిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిల్లాల కుమార్, వార్డు సభ్యుడు విలన్, ఉపాధ్యాయులు జి. ఉషారాణి, పి. అనిత, త్రివేణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హిందీ టైపింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

## - డిజిటల్ యుగంలో హిందీ నైపుణ్యాలకు పెరుగుతున్న ప్రాధాన్యం



**బిచ్కుంద, సెప్టెంబర్ 19: హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి, బిచ్కుందలో నిర్వహిస్తున్న హిందీ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు హిందీ టైపింగ్ పోటీ నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ టైపింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా హిందీ విభాగాధిపతి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో హిందీ భాష వినియోగం విస్తరిస్తున్న నేపథ్యంలో హిందీ టైపింగ్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు భాషా పరిజ్ఞానంతో పాటు సాంకేతిక నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హిందీ టైపింగ్‌కు ఉపయోగపడే అవసరమైన సాఫ్ట్‌వేర్లను కళాశాలలో ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ పోటీకి న్యాయనిర్ణేతగా ఎన్నావార్ వెంకటేష్ వ్యవహరించారు.

# ఫ్యాషన్, మోడలింగ్‌లో భాను విజయ ప్రస్థానం

## - ప్యాషన్‌ను కెరీర్‌గా మలుచుకుంటూ ..
## - పేజెంట్ టైటిల్‌తో మరో ముందడుగు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**




విజయవాడ: చిన్నప్పటి నుంచే ఫ్యాషన్, మోడలింగ్‌పై ఆసక్తి పెంచుకున్న భాను.. తన ప్యాషన్‌ను కెరీర్‌గా మలుచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం యాక్టింగ్‌తో పాటు డాన్స్, మోడలింగ్, పేజెంట్స్‌లోనూ తన ప్రతిభను చాటుకోవాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు.

చదువు పూర్తయిన తర్వాత తనకు ఎంతో ఇష్టమైన రంగంలో కొనసాగడం కొంత కష్టంగా అనిపించినప్పటికీ, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఆమెకు అండగా నిలిచింది. ముఖ్యంగా తల్లి అందించిన సహకారం, కుటుంబం ఇచ్చిన ప్రోత్సాహంతో తన కలల వైపు మరింత ధైర్యంగా అడుగులు వేయగలిగానని భాను తెలిపారు. పేజెంట్ జర్నీలో తనకు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించిందని, ఈ ప్రయాణం తనలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం గెలుచుకున్న టైటిల్ తనకు ఎంతో ప్రత్యేకమైనదని, ఇది జీవితంలో మరచిపోలేని భావోద్వేగ క్షణమని భాను ఆనందం వ్యక్తం చేశారు. తన ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ భాను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఈ మంచి అవకాశాన్ని అందించిన వెవెంట్జ్ టీమ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సహకారం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. భవిష్యత్తులో యాక్టింగ్, డాన్స్, మోడలింగ్, పేజెంట్స్ రంగాల్లో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడమే లక్ష్యంగా భాను ముందుకు సాగుతున్నారు.

# గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

## మేము మౌనాన్ని పాటిస్తే - బిఆర్ఎస్ నాయకుల రాజకీయం
## బిఆర్ఎస్ మండల నాయకుల అక్రమ ఆస్తులు బయటపెడతాం
## బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు

**( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 19:)**





రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. మాజి శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో.... వివిధ గ్రామాల నుంచి నూతన మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీ లో అన్ని గ్రామాలు కలపాలి అనే ఉద్దేశంతో.. జేఏసీగా ఏర్పడి అందరి మద్దతుతో.. మండల కేంద్రం లోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో.. ఆమోదం తెలపగా బిఆర్ఎస్ మండల నాయకులు మరియు సర్పంచులు.. మద్దతు తెలపకపోవడంతో.. అధికార పార్టీ నిరసనతో ర్యాలీగా వెళ్లి మహేశ్వరం మండలంలో ఉన్న అన్ని గ్రామాలు ఫ్యూచర్ సిటీలో కలపాలని తెలపడంతో.. ఒకవైపు అభివృద్ధి కోసం ప్రయత్నిస్తుంటే మరోవైపు బిఆర్ఎస్ నాయకులు స్వార్థం కోసం ఆలోచిస్తూ మద్దతు తెలుపకపోగా.. ఇంతకుముందే స్థానిక మంత్రిని కలిసాం మేము మద్దతు తెలిపాం అని ప్రకటన ఇవ్వడం సిగ్గుచేటు అని తెలియజేశారు. మీరు మద్దతు తెలిపినట్లైతే ఎంతమంది సర్పంచులు ఉన్నారో బిఆర్ఎస్ పార్టీ తరఫున లికిత పూర్వకంగా రాసి మద్దతు తెలుపుతున్నట్టుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా గిరిజన నాయకులు మాట్లాడుతూ.. ఎవరైతే తప్పుడు ప్రచారం చేస్తున్నారో వారిపై మండిపడ్డారు.. గిరిజన నాయకులను గుర్తించిందే కాంగ్రెస్ ప్రభుత్వం మీకు తెలవకపోతే మీ తాతలను గాని మీ తండ్రులను గాని అడిగి తెలుసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో.. తండాలను పంచాయతీలుగా విభజించి గాలికి వదిలేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీని కేఎల్ఆర్ చొరవతో అభివృద్ధి చేయడం జరుగుతుంది అన్నారు. ప్రస్తుతం ఉన్న లోకల్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.. స్థానిక ప్రజల సమస్యలు మర్చిపోయి.. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యేగా ఉండి ప్రభుత్వం దగ్గర నుంచి పన్నులు తీసుకొని వచ్చి గ్రామాల అభివృద్ధి చేయవలసిన స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండిపడ్డారు.. ఎవరైతే గిరిజన నాయకులు మీడియా ముందు ఎక్కువగా మాట్లాడుతున్నారో.. మహేశ్వరం మండలంలో ఎవరెవరి ఆస్తులు ఎన్ని ఉన్నాయో వారి అన్ని ఆస్తులు బయటికి తీస్తామని హెచ్చరించారు రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజనుల అభివృద్ధి బాటలో నడుస్తారని ధీమా వ్యక్తం చేశారు..

ఈ కార్యక్రమం లో మహేశ్వర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, మండలం మాజీ అధ్యక్షులు కాకి ఈశ్వర్, మహేశ్వర మండల సర్పంచ్ పోరం అధ్యక్షులు రాజు నాయక్, చిన్న తుప్పర సర్పంచ్ రాజు, వర్కల యాదగిరి గౌడ్, జగన్మోహన్ రెడ్డి పెండ్యాల సర్పంచ్, సుభాన్పూర్ సర్పంచ్ మల్లేష్, రామచంద్రగూడ సర్పంచ్ దేవేందర్ నాయక్ , ఉప సర్పంచ్ భాస్కర్ నాయక్,అల్లే కుమార్,వెంకట్ రెడ్డి, కూన యాదయ్య, ఆవుల యాదయ్య, పెండ్యాల ఉప సర్పంచ్ మంత్రి అంజయ్య, మంత్రి బాల్‌రాజ్,మహేశ్వర్ మండల బిసి సెల్ అధ్యక్షులు బొల్లు కుమార్ యాదవ్, నరసింహ యాదవ్, నడికుడ శివ, లోకేశ్వర్ రెడ్డి, హాజీ బాబా గిరిజన నాయకులు కృష్ణ నాయక్, పాండు నాయక్, అంధ్య నాయక్, దేవేందర్ నాయక్, భాస్కర్ నాయక్ రవీందర్ నాయక్, నరసింహ నాయక్, హరిచంద్, నాగేందర్ లక్ష్మణ్ నాయక్, రవి నాయక్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# లక్షన్నర కుటుంబాలకు సన్నబియ్యం - కెఎల్ఆర్

## మహేశ్వరం నియోజకవర్గంలో 1,56,451 కార్డులు
## అందరికీ ఆహార భద్రత “స్మార్ట్ కార్డులు’ పంపిణీ: రేషన్ షాపులు

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 19:)**

రంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఇచ్చిన కార్డులు లక్షా 15వేలు బిఆర్ఎస్ పాలనలో పేదలు, మధ్య తరగతి ప్రజలు రేషన్ కార్డులు, సన్నబియ్యానికి నోచుకోలేదని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్త, పాత ఆహార భద్రతా కార్డులు కలిపి లక్షా 56 వేల 451 కుటుంబాలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నామని కేఎల్ఆర్ తెలిపారు. ఇప్పటికే 3నెలలకు సరిపడా సన్నబియ్యం కోటాను లబ్ధిదారులకు అందజేశామని పౌరసరఫరాల శాఖాధికారులు తెలిపారు.

లక్షన్నర ఇళ్లకు అందించిన సన్నబియ్యంతో 6.25 లక్షల మంది కుటుంబ సభ్యులు (ఇంటికి నలుగురు చొప్పున) కడుపు నిండా పౌష్టికాహారం తింటున్నారని లక్ష్మారెడ్డి చెప్పారు.

బిఆర్ఎస్ పాలనలో సంక్షేమం లేదు- ప్రజాపాలనలో సంక్షేమం- అభివృద్ధి

మాజీ సీఎం కెసిఆర్ పాలనలో సంక్షోభం తప్పా... సంక్షేమం లేదని ఎద్దేవా చేశారు కిచ్చెన్న.

ప్రజాపాలన అధికారంలోకి వచ్చాక పేద, మధ్యతరగతి కుటుంబాలన్నీ సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలెండర్, ఆర్టీసీ ఎవరు బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లతో కళకళలాడుతున్నారని లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ధాన్యం పండించే రైతన్నకు పెట్టుబడి సహాయం, రూ.500 బోనస్, రూ.2లక్షల ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి కే దక్కుతుందని మరోసారి కేఎల్ఆర్ స్పష్టం చేశారు.

ఆహార భద్రతా స్మార్ట్ కార్డులు ప్రతీ కుటుంబానికి అందించేలా రేషన్ దుకాణాదారులు బాధ్యత తీసుకున్నారని చెప్పారు.

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కొత్తగా లక్షా 15వేల రేషన్ కార్డులను మంజూరు చేశామని అధికారులు తెలిపారు.

మహేశ్వరం నియోజకవర్గంలో...



కందుకూర్ మండలంలో 17,266 కార్డులు, మహేశ్వరం మండలం (తుక్కుగూడ డివిజన్లు కలుపుకుని) 21,964 కార్డులు,సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్లు కలుపుకుని 63,667 రేషన్ కార్డులు,బాలాపూర్ మండలం (జల్ పల్లి, మీర్ పేట, బడంగ్ పేట డివిజన్లు కలుపుకుని) 53,554 కార్డులు ఉన్నాయి

మొత్తం లక్షా 56 వేల 451 కార్డులు పంపిణీ చేశామని కేఎల్ఆర్ తెలియజేశారు

# జాతీయ జనగణనలో బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి

## కేంద్రంపై ఒత్తిడికి జాతీయ స్థాయి ఉద్యమం చేపట్టాలి
## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జాతీయ బీసీ దళ్ వినతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:**

జాతీయ జనగణనలో బీసీ/ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి, కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ... జాతీయ జనగణనలో బీసీలను చేర్చాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని జాతీయ స్థాయిలో మహా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

రాబోయే జాతీయ జనగణనలో బీసీ/ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీని చేర్చడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై స్పష్టమైన గణాంకాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన బీసీ కులాల జాబితాల ఆధారంగానే ఈ వివరాలను నమోదు చేయాలని కోరారు.

బీసీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని పక్షాలను ఒకే తాటిపైకి తీసుకురావాలని ఆయన సూచించారు. తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కుల సర్వే అనుభవాలను పరిగణనలోకి తీసుకొని, శాస్త్రీయ పద్ధతిలో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. 2011 నాటి సామాజిక, ఆర్థిక కుల గణనలో తలెత్తిన సాంకేతిక లోపాలు పునరావృతం కాకుండా కేంద్రం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గుర్తుచేశారు. విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం చేకూరాలంటే బీసీల కచ్చితమైన లెక్కలు తప్పనిసరని, హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.



RNI No Tel /2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
20 సెప్టెంబర్ ఆదివారం 2026

# సైనికుడి కుటుంబానికి అండగా ఆర్టీఐ కమిటీ

## - ఇంటి నంబర్ మార్పుపై రికార్డుల వెలికితీతకు మూడు జిల్లాల అధ్యక్షుల చొరవ





**జనగామ, సెప్టెంబర్ 19 హైదరాబాద్ ఎస్టేట్:**

దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న ఓ సైనికుడి కుటుంబం ఎదుర్కొంటున్న ఇంటి నంబర్ సమస్యపై సమాచార హక్కు పరిరక్షణ కమిటీ స్పందించింది. సమస్యకు సంబంధించిన పాత, ప్రస్తుత అధికారిక రికార్డులను సేకరించి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు జనగామ, వరంగల్, ఖమ్మం జిల్లాల కమిటీ అధ్యక్షులు చొరవ తీసుకున్నారు. సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న రైతు కుటుంబానికి చెందిన సైనికుడు ఫోన్ ద్వారా జనగామ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జావిద్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామిని సంప్రదించి కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యను వివరించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. దేశ రక్షణ విధుల్లో ఉండటంతో కుటుంబ సమస్యపై అధికారులను స్వయంగా కలవడం కష్టంగా ఉందని, తమ కుటుంబానికి న్యాయం జరిగేలా సహకరించాలని సైనికుడు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కమిటీ ప్రతినిధులు సమస్యను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించేందుకు ముందుకొచ్చారు. కుటుంబానికి సంబంధించిన 4-15 ఇంటి నంబర్ 4-15/1, 4-15/2గా ఎలా మారింది? అనే అంశంపై స్పష్టత కోసం పాత, ప్రస్తుత రికార్డులను పరిశీలించనున్నారు. ఇంటి నంబర్ తొలుత ఎవరికి, ఎప్పుడు కేటాయించారు? 1990 నుంచి ఇంటి పన్ను ఎవరి పేరుతో నమోదైంది? నంబర్ మార్పు కోసం ఎవరు దరఖాస్తు చేశారు? మార్పునకు ఏ అధికారి అనుమతి ఇచ్చారు? అందుకు ఆధారమైన దరఖాస్తులు, ఉత్తర్వులు, అనుమతులు, పన్ను రికార్డులు ఏమిటనే వివరాలను సమాచార హక్కు చట్టం2005 కింద సేకరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఆర్టీఐ దరఖాస్తు సమర్పించి, ఇంటి నంబర్‌కు సంబంధించిన పాత, ప్రస్తుత రికార్డులతో పాటు మార్పునకు సంబంధించిన అధికారిక పత్రాలను కోరనున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. రికార్డుల ద్వారా వాస్తవ పరిస్థితి స్పష్టమైన అనంతరం సమస్య పరిష్కారానికి అవసరమైన తదుపరి చట్టబద్ధమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జనగామ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జావిద్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ కాసోజు మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుడి కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కుటుంబానికి అన్యాయం జరిగిందా లేదా అన్నది అధికారిక రికార్డుల పరిశీలనతోనే స్పష్టమవుతుందని పేర్కొన్నారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చే వరకు కుటుంబానికి చట్టబద్ధమైన మార్గాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# బాలయ్యపల్లి బాధిత కుటుంబాలకు అండ

## - మృత విద్యార్థుల కుటుంబాలకు పరామర్శ..

## - రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం




గీసుగొండ, సెప్టెంబర్ 19, హైదరాబాద్ ఎస్టేట్:

గీసుకొండ మండలం బాలయ్యపల్లికి చెందిన రాగిరి గణేష్, నల్ల సిద్ధార్థ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడంతో విషాదంలో ఉన్న వారి కుటుంబాలను ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. జిల్లా నాయకులు అల్లం మర్రెడ్డి, గీసుకొండ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్‌తో కలిసి బాలయ్యపల్లికి వెళ్లిన స్వప్న బాల కిషోర్ రెడ్డి.. రాగిరి గణేష్ తల్లిదండ్రులు లింగమూర్తి, అనిత, నల్ల సిద్ధార్థ తల్లిదండ్రులు అశోక్, ఉమాలను పరామర్శించి ఓదార్చారు. విద్యార్థుల మృతిపై విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా స్వప్న బాల కిషోర్ రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలు ఒంటరిగా లేవని, వారికి అండగా ఉంటామని తెలిపారు. భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కోల కుమారస్వామి, దౌడు బాబు, మాజీ ఉపసర్పంచ్ పొగాకు బిక్షపతి, సొసైటీ డైరెక్టర్ దౌడు సునీల్, వార్డు సభ్యుడు పసుల యుగేందర్, గాడిదుల బొంద్యాలు, కందికొండ రాజు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి

## - నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి

## : అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి




**గీసుగొండ, సెప్టెంబర్ 19, హైదరాబాద్ ఎస్టేట్:**

గ్రామీణ మహిళలు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ, సెర్ప్ ఆధ్వర్యంలో గీసుగొండలో నిర్వహిస్తున్న సృజనాత్మక ఆభరణాల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి, సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ పరిశీలించారు. గీసుగొండ వీఓ భవనంలో సెప్టెంబర్ 9 నుంచి 22 వరకు ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ బ్యాచ్ నంబర్ 27/202627లో భాగంగా శిక్షణ కొనసాగుతోంది. ఆభరణాల తయారీ నైపుణ్యాలు, తయారీ విధానాలు, మార్కెటింగ్ అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలపై శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి శిక్షణార్థులతో మాట్లాడి వారి నైపుణ్యాలు, శిక్షణ ద్వారా లభిస్తున్న అవకాశాలను తెలుసుకున్నారు. నేర్చుకున్న నైపుణ్యాలను స్వయం ఉపాధిగా మలుచుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. తమ ప్రతిభను వ్యాపారంగా అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫార్మ్ డీపీఎం వరలక్ష్మి, ఏపీఎం ఈశ్వరయ్య, ఇక్రిశాట్ శ్రీనివాస్, సీసీ సురేష్, ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ శిక్షకురాలు పుష్పవల్లి, వీఓఏలు హేమలత, జ్యోతి, సరస్వతి, భవాని, శిక్షకులు, శిక్షణార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో వినయ్ భాస్కర్ పూజలు

## - ఎన్జీవోస్, సమ్మయ్యనగర్ కాలనీల్లో సందర్శన.. - పర్యావరణహిత వేడుకలకు పిలుపు



**హనుమకొండ, సెప్టెంబర్ 25, హైదరాబాద్ ఎస్టేట్:**

ఎన్జీవోస్ కాలనీ, సమ్మయ్యనగర్ కాలనీల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాలను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సందర్శించారు. మండపాల్లో కొలువుదీరిన శ్రీ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కాలనీ ప్రజలకు సూచించారు. మండపాల నిర్వాహకులను కలిసి పూజా, భక్తి కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు, యువత, మహిళలు, మండపాల నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మండపాల నిర్వాహకులు, యువత, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# ఈనెల 21గ్రామస్థాయి నుండి 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య




హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

జయశంకర్ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి ఈనెల 21న అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భవించి 50 సంవత్సరాలు అవుతూన్నందున 50వ ఆవిర్భావ దినోత్సవం గ్రామ మండల జిల్లా రాష్ట్ర స్థాయి వరకు వేడుకలు ఘనంగా జరపాలని అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం రిజిస్ట్రేషన్ నంబర్ 1033/77 ఈ ఆవిర్భవ దినోత్సవం లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలతో పాటు మేధావులు ఉద్యోగులు శ్రేయోభిలాషులు కుల మతాలకు అతీతంగా వివిధ రాజకీయ పార్టీలకతీతంగా హాజరై ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. రాష్ట్రస్థాయి గ్రామస్థాయి నుండి ఆవిష్కరించే జెండా కార్యక్రమంలో తెలుపు రంగు జెండా గద్దె ఉండాలని నీలిరంగు జెండా కర్ర మరియు నీలిరంగు జెండా గుడ్డను ఆవిష్కరించాలని అన్నారు. మహనీయుల ఆశయాలతో పనిచేస్తు మరణించిన వారికి జోహార్లు అర్పించాలని అన్నారు .

# 22ఎ సమస్యలకు త్వరలో ముగింపు

## 12 అంశాలలో ఇప్పటికే 2 అంశాలకు జీవో జారీ

## మరికొన్ని అంశాలపై తీపికబురు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్**

రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు శాసనసభలో చేసిన ప్రకటన మేరకు త్వరలో ప్రజలకు తీపికబురు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనిలో భాగంగా అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై దృష్టి సారించి దశల వారీగా వాటిని నెరవేరుస్తున్నామని ఈ మేరకు కాలనీల సమస్యపై జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను విడుదల చేశామన్నారు.

ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్దీకరణకు సంబంధించి సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ధృవ పత్రాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లబ్దిదారులకు అందజేశారు.

ఈ సందర్బంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆలోచనల మేరకు ఈ క్యూర్ ప్రాంతాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యల పరిష్కారానికి గాను ఆధార్ వలే భూధార్ కార్డులు ఇస్తామని, ఈ క్యూర్ ప్రాంతంలో కూడా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేమని తమకు ప్రజాసేవే ముఖ్యమని అన్నారు. ఇటీవల శాసనసభలో భూ సమస్యలపై సుదీర్ఘంగా చెప్పామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలు, 12 అంశాల మేరకు ఈ సరూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 64 కాలనీల్లోని 44 కాలనీల సమస్యను పరిష్కరించామని తెలిపారు.

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 118 జీఓ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన హామీని ఈరోజు నిలబెట్టుకున్నామన్నారు

ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాము బేషజాలకు పోకుండా ఇక్కడి 44 కాలనీల సమస్యలపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులున్నా ఇప్పుడు వాటిని నెలరోజులలోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లుకూల్చరని స్పష్టం చేశారు.

జీవో 118 సహకారంతో మేడ్చల్ , రంగారెడ్డి జిల్లాలోని మరికొంత మందికి కూడా నెలలోగా సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ప్రాంత కాలనీలు చాలా కాలం నుంచి 22ఎలో ఉన్నాయని వివరిస్తూ 22ఎ కు సంబంధించి త్వరలో ఈ ప్రభుత్వం తీపి కబురు చెప్పనుందని తెలిపారు. 22ఎ అనేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అమలులో ఉందని, దీనిని పరిశీలించుకోవచ్చునన్నారు. అయితే కొంతమంది దీనిని అసరాగా చేసుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

మరో వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా ప్రభుత్వ ఆదేశాలు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సమస్య, దరఖాస్తు చేసుకోని వారి సమస్యను పరిష్కరించేందుకు ఈ వేదికగా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు త్వరలో ఈ మేరకు శుభవార్త చెబుతారని ప్రకటించారు.

సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను అమలు చేయబోతున్నామని దీనికోసం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మరో 45 రోజుల్లో పూర్తిస్థాయిలో భూసమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు.

కార్యక్రమంలో ఎల్. బి. నగర్, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు డి .సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఎల్. బి. నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
20 సెప్టెంబర్ ఆదివారం 2026

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- డ్రైనేజీలను వెంటనే క్లియర్ చేయాలి..
- ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అత్యవసర పరిస్థితులకు వేగంగా స్పందించాలి

: సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్ ఎస్టేట్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్**

సెప్టెంబర్ 19: రాష్ట్రంలో భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సంబంధిత అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, పోలీస్ కమిషనరేట్ల ఉన్నతాధికారులతో వర్షాల నేపథ్యంలో చేపట్టిన ముందస్తు చర్యలు, సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.

వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలని సీఎస్ ఆదేశించారు. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించాలని, నీరు నిలిచే ప్రాంతాల్లో డ్రైనేజీలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. వర్షాల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే వేగంగా స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సమాచారం ప్రకారం, భారీ వర్షాల నేపథ్యంలో రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు/ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. గంటకు 40 కిలోమీటర్ల వరకు ఉపరితల గాలులు వీచే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు, ఫీల్డ్ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు.

--------------------------------------------------------------------------------

స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ చే జారీ చేయనైనది.

# 22-ఏపై బీఆర్ఎస్ ప్రచారానికి కౌంటర్

## - 1.02 కోట్ల ఎకరాల్లో ప్రైవేటు భూముల వివాదం 3.73 లక్షల ఎకరాలే

## : డా. కోటూరి మానవతారాయ్

**హనుమకొండ, సెప్టెంబర్ 19, హైదరాబాద్ ఎస్టేట్:**

22-ఏ నిషేధిత జాబితాపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి వాస్తవాలతో సమాధానం ఇచ్చారని టీపీసీసీ అధికార ప్రతినిధి, వరంగల్‌హనుమకొండ సమన్వయకర్త డా. కోటూరి మానవతారాయ్ అన్నారు. 22-ఏ జాబితాలో ఉన్న మొత్తం 1.02 కోట్ల ఎకరాల్లో ప్రైవేటు భూముల వివాదం 3.73 లక్షల ఎకరాలేనని అసెంబ్లీలో సీఎం స్పష్టం చేశారని తెలిపారు. వరంగల్ డీసీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 22-ఏ సమస్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే ఉందని, బీఆర్ఎస్ పాలనలోనూ కొనసాగిందని పేర్కొన్నారు. నిషేధిత జాబితాలోని భూములన్నీ ప్రైవేటు భూములేనన్నట్లుగా ప్రజల్లో అపోహలు కల్పించడం సరికాదన్నారు. అటవీ, అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ తదితర భూములు కూడా 22-ఏ జాబితాలో ఉన్నాయని వివరించారు. ధరణి పోర్టల్‌లో పొరపాటున 22-ఏ జాబితాలో చేరిన ప్రైవేటు భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఫిర్యాదులను స్వీకరించి, అర్హత ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 22-ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని మానవతారాయ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల నిర్వహణ, ధరణి వ్యవస్థపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో




ప్రస్తావించిన అంశాలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పాపన్నపేట పాతూర్ వినాయక మంటపంలో మహిళలు ఘనంగా కుంకుమార్చన పూజలు...

## అన్నదాన కార్యక్రమం



**మెదక్,సెప్టెంబర్ 19(హైద్రాబాద్ ఎస్టేట్):**

మండల కేంద్రమైన పాపన్నపేట పాతూర్ హనుమాన్ ఆలయం వద్ద నెలకొల్పిన వినాయక మంటపం వద్ద శనివారం మహిళలు వినాయకునికి ఘనంగా కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంటప ప్రత్యేక పూజారి చెరువు పల్లి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.పాపన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దోసని సంగమేశ్వర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈకార్యక్రమంలో సహారా యూత్ యువజన సంఘం సభ్యులు గొల్ల విష్ణు దంపతులు వినాయకుని పూజల్లో పాల్గొన్నారు.

# నిమజ్జనానికి ముందే అప్రమత్తం

## - కట్ట మల్లన్న చెరువు వద్ద అధికారుల సంయుక్త పరిశీలన..

## - భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

**గీసుగొండ, సెప్టెంబర్ 19, హైదరాబాద్ ఎస్టేట్:**

వినాయక నిమజ్జన ఉత్సవాలను సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా కట్ట మల్లన్న చెరువు కట్ట, నిమజ్జన ప్రాంతాలను తహసీల్దార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఫిషరీస్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, దేవాదాయ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, నిమజ్జన సమయంలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించారు. ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్ భద్రత, రహదారి సౌకర్యాలు, చెరువు కట్ట భద్రత, నీటిలో రక్షణ చర్యలు, మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గుర్తించిన సమస్యలను ఆయా శాఖలు తక్షణమే పరిష్కరించాలని, నిమజ్జన ఉత్సవాల నాటికి అవసరమైన పనులన్నీ పూర్తి చేయాలని అధికారులు సూచించారు. ఇప్పటికే చెరువులో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన ఏర్పాట్లను కూడా వేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు చర్యలు



చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు అధికారులకు సహకరించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు తోడ్పడాలని సీఐ విశ్వేశ్వర్ కోరారు.

# రాత్రివేళ బ్యాటరీల చోరీలకు చెక్!

## - ఐదు కేసులు ఛేదించిన కేయూసీ పోలీసులు

## - రూ.లక్ష విలువైన 16 బ్యాటరీలు స్వాధీనం.. నిందితుడి అరెస్టు

**హనుమకొండ, సెప్టెంబరు 19, హైదరాబాద్ ఎస్టేట్:**




రాత్రివేళల్లో పార్క్ చేసిన వాహనాల బ్యాటరీలను చోరీ చేస్తున్న నిందితుడిని కేయూసీ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.లక్ష విలువైన 16 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. కేయూసీ, మడికొండ, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన ఐదు కేసులను ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. హనుమకొండ బాలసముద్రానికి చెందిన పస్తం అయిలు కుమార్ (35) జవహర్‌కాలనీ, వడ్డేపల్లి, మిల్స్‌కాలనీ, మడికొండ ప్రాంతాల్లో రాత్రివేళల్లో పార్క్ చేసిన ట్రాక్టర్లు, లారీలను లక్ష్యంగా చేసుకుని బ్యాటరీలు చోరీ చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో నిందితుడిని గుర్తించి అరెస్టు చేసి, అతడి నుంచి 16 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు కేయూసీ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ వెల్లడించారు. నిందితుడిపై గతంలో 36 దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. 2012లో వరంగల్ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ల చోరీకి సంబంధించి ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. కేసులను ఛేదించిన ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్, ఎస్ఐ కె. నవీన్‌కుమార్, క్రైమ్ సిబ్బంది అహ్మద్ పాషా, రాజశేఖర్‌లను హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ సీపీ శ్వేత ఐపీఎస్ అభినందించారు.

# ప్రజారోగ్యానికి ఫార్మసీ సేవలు కీలకం

## - 732 ఫార్మసీ పోస్టుల నియామకంపై స్పష్టత ఇవ్వాలి..

## - ప్రత్యేక ఫార్మసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన మందులు అందించడంలో ఫార్మసీ అధికారులు, ఫార్మసిస్టుల పాత్ర కీలకమని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా తెలంగాణలో ఫార్మసీ సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మందుల పంపిణీతో ఫార్మసిస్టుల బాధ్యత ముగియదని, మందుల నాణ్యత, నిల్వ, సరఫరా, సరైన మోతాదు, ఔషధ భద్రత, రోగికి సరైన మందు చేరేలా చూడటం వంటి కీలక బాధ్యతలను వారు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థలో వారి వృత్తి నైపుణ్యాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో పెరుగుతున్న వైద్య అవసరాలకు అనుగుణంగా ఫార్మసీ కేడర్‌ను బలోపేతం చేయాలని టీజీపీఓఏ కోరింది. పీహెచ్‌సీల్లో అవసరానికి అనుగుణంగా ఫార్మసీ ఆఫీసర్ పోస్టులు పెంచడంతో పాటు పల్లె, బస్తీ దవాఖానాల్లో ఫార్మసీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, బోధనాసుపత్రుల్లో క్లినికల్ ఫార్మసీ విభాగాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. జిల్లా స్థాయిలో అవసరమైన ఫార్మసీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రత్యేక ఫార్మసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని సంఘం కోరింది. ఔషధాల కొనుగోలు నుంచి నాణ్యత, నిల్వ, సరఫరా, పంపిణీ, ఔషధ భద్రత వరకు సమగ్ర పర్యవేక్షణకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఫార్మసీ అధికారులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్యప్రమాద బీమా, తగిన సేవా ప్రయోజనాలు కల్పించాలని, మాజీ 104 ఎఫ్‌డీహెచ్‌ఎస్ ఫార్మసీ అధికారుల పెండింగ్ వేతనాల సమస్యను పరిష్కరించాలని కోరింది. 732 ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల నియామక ప్రక్రియపై స్పష్టత ఇచ్చి,



నిబంధనలున్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగా త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. బీ.ఫార్మసీ, ఫార్మ్.డీ, ఎం.ఫార్మసీ అర్హత కలిగిన నిపుణులకు వారి విద్యార్హతలు, అనుభవానికి అనుగుణంగా వృత్తి, పదోన్నతి అవకాశాలు కల్పించాలని సుదర్శన్ గౌడ్ కోరారు. ఫార్మసీ సేవలు బలోపేతమైతే ఔషధ భద్రత మెరుగుపడి, ప్రజారోగ్య వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు.

# పాపన్నపేట మార్కండేయ గణేష్ మండపం వద్ద అన్నప్రసాద కార్యక్రమం

**మెదక్,సెప్టెంబర్19(హైద్రాబాద్ ఎస్టేట్):**

పాపన్నపేట మండల కేంద్రంలోని మార్కండేయ గణేష్ మండపం వద్ద గణపతి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి.శనివారం రోజు పాపన్నపేట చేనేత సహకార సంఘం అధ్యక్షులు కొడుపాక విఠల్ గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ప్రత్యేక ఆకర్షనీయమైన పూలతో విశేష అలంకరణ చేసిన గణేష్ మండపంలో కొడుపాక విఠల్,కొడుపాక రాజేష్ కుటుంబ సభ్యులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అన్నదాన కార్యక్రమంను
గణేష్ మండలి కమిటీ సభ్యులు
కొడుపాక శివశంకర్,
బీకొండ సంపత్,మదనాల అరవింద్,
బీకొండ సాయికిరణ్,
అచ్చుకట్ల మహేష్,
చామంతుల అరవింద్,
వళ్ళందేశి మహేష్,
పల్లె ప్రసాద్,వళ్ళందేశి ఉదయ్ కిరణ్,బోనకుర్తి దీపక్,పల్లె సాయికిరణ్,
పడిగే శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు.కాగా ఈపూజ కార్యక్రమంలో
పద్మశాలి కులస్థులు
కొడుపాక విఠల్,
పల్లె సంగమేశ్వర్,
వళ్ళందేశి శ్రీనివాస్,పడిగే కృష్ణ,
బద్దాపురం సంగమేశ్వర్,
కొడుపాక ఉమామహేశ్వర్,
పల్లె లక్ష్మణ్,కల్లేటి యుగేందర్,
పల్లె రాజు,తూర్పు రాజు,
దాసరి యాదగిరి,అచ్చుకట్ల గురునాథ్,తూర్పు రాము,



కొడుపాక దుర్గేష్,
కొడుపాక పూర్ణచందర్,
రాజారాం చంద్రం,వళ్ళందేశి మునీందర్,చామంతుల నాగరాజు,కొడుపాక రాజేష్, వళ్ళందేశి రాజు పెద్దలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గణపయ్య ఆశీర్వచనాలు పొందారు.
అనంతరం గణేష్ మండపం వద్ద భక్తి పాటలతో భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

# బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఎవరి కులం ఎంతో వారి కంత వాటా బహిరంగ పంచాయతీ సభ కరపత్రాల ఆవిష్కరణ

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

19-09-2026న చిట్యాల మండల కేంద్రంలో సామాజిక న్యాయం రాజ్యాధికారం అనే నినాదంతో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మసమాజ్ పార్టీ మద్దతుతో ఎవరి కులమెంతో వారికంత వాటా బహిరంగ పంచాయతీ సభ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది.

అనంతరం చింతల రమేష్ ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి గారు మాట్లాడుతూ వేల సంవత్సరాల నుండి తెలంగాణ ప్రాంతం అతిపెద్ద అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థ ఈ వ్యవస్థ కింద మన సబ్బండ కులాలైన 90 శాతం బీసీ, ఎస్సీ ఎస్టీలు తరతరాలుగా దోపిడీకి గురై బానిసలుగా నలిగిపోయి కాలిపోయి నశించిపోయారు తమ జీవితాలన్నీ ధ్వంసం ఐపోయాయి భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలైన రోజు నుండి ఈ బీసీ ఎస్సీ ఎస్టీల జీవితాలలో కొంత మార్పు ప్రారంభమైంది కానీ ఆ కొద్ది మార్పు తరతరాల తమ జీవిత విధ్వంసానికి ఏ మాత్రం సరిపోదు సమాధానం కాదు మూడున్నర కోట్ల మంది బీసీ ఎస్సీ ఎస్టీల బానిసత్వం కటిక పేదరికం అణచివేత బద్దలు కావాలంటే ఒక రాజకీయ భూకంపం ఈ జనంలో రావాలి అందుకోసం ఈ ప్రజలలో సామాజిక న్యాయ సమరం సాగాలి రాజ్యాధికార యుద్ధం రగిలించాలి ఇదే అసలైన ప్రజాస్వామ్యం గణతంత్ర రాజ్యానికి పునాది ఇదే భారత రాజ్యాంగం ఆశించింది పూలే అంబేడ్కర్ కాన్షిరాం లు కోరుకున్నది ఇదే ఇప్పుడు మన తెలంగాణలో మన బీసీ ఎస్సీ ఎస్టీలు చేయాల్సిన కర్తవ్యం ధర్మం ఇదే ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం అంతట మన వర్గాల ప్రజల్ని ఈ దిశగా చైతన్యపరిచి సామాజిక న్యాయం రాజ్యం కై యుద్ధం వైపున నడిపించాలి . దానికోసం రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 90 శాతం పైన ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలను చైతన్యం చేస్తున్న క్రమంలో సెప్టెంబర్ 27వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ణ కన్వెన్షన్ హాల్ హంటర్ రోడ్ హనుమకొండ లో ఈ సభను ఏర్పాటు చేస్తున్నాము



కావున బిసి, ఎస్సీ ఎస్టీ ప్రజలు మేధావులు విద్యావంతులు ఉద్యోగస్తులు వివిధ కుల సంఘాల నాయకులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు యువకులు అగ్రకుల ప్రజాస్వామికవాదులు అందరూ ఈ సభలో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాము

ఈ కార్యక్రమంలో దాసరి రాజు యాదవ్ గొర్రెల కాపర్ల జిల్లా అధ్యక్షులు & అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధికార ప్రతినిధి పుల్ల మల్లయ్య అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పర్లపల్లి వంశీ మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు శీలపాక నాగరాజు, పుల్ల అశోక్ మండల ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రమేష్ కార్యదర్శులు రత్న రమేష్, మట్టేవాడ కుమార్ చిలుముల శశి కుమార్ చిలుముల కృష్ణ బొడ్డు పాల్ చరణ్ పాల్గొన్నారు.

# గణేశుడికి భక్తిశ్రద్ధలతో పూజలు.





(హైదరాబాద్ ఎస్టేట్ హన్మకొండ జిల్లా ప్రతినిధి వక్కల రమేష్ సెప్టెంబర్-19).

హనుమకొండ జిల్లా నేచర్ కాలనీ గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి నవరాత్రుల సందర్భంగా శనివారం నేచర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో గణేష్ నికి గరికతో అర్చన నిర్వహించారు నేచర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాల్లో అన్న ప్రసాద. వితరణ. వివిధ సంస్కృతి కార్యక్రమాలు నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు మహిళలు పూజలో పాల్గొని స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో కాలనీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు ఈరోజు ఈ పూజా కార్యక్రమంలో వక్కల రమేష్ దంపతులు మరియు పసికంటి రాజేష్ దంపతులు పూజలో పాల్గొనడం జరిగింది

# బాలాపూర్‌లో గణనాథుడి పూజలో సబితా ఇంద్రారెడ్డి, హరీష్ రావు

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి బాలాపూర్**

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్‌లో నిర్వహించిన గణనాథుడి పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏరోళ్ల శ్రీనివాస్ మరియు మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సకాలంలో కురువ్వాలని నేతలు ఆకాంక్షించారు.



# గణనాథుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గారు



శంకరంపేట్ (A) పట్టణంలో హిందు వాహిని యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి గారు

అనంతరం యూత్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే గారిని శాలువాతో సన్మానించారు.వారితోపాటు మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సుభాష్, మాజీ ఎంపీటీసీ దత్తు, వెంకన్న, సాయిలు హిందు వాహిని యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఉన్నతాధికారుల గౌరవ మర్యాదల్ని కాపాడాలి

## లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దశరథ నాయక్

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్**



IAS \T, IPS లతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగుల గౌరవ మర్యాదల్ని, స్థాయిని తగ్గించవద్దు.గౌరవ ముఖ్యమంత్రి గారు జండా ఆవిష్కరణ చేసిన తరువాత జవీ గారు ప్రసంగిస్తున్నంత సేపూ జవీ కి ఇరుపక్కల జష్ట్రఅవట ూవఎతీమ్ఖతీఎ మరియు ణ+ూ లు నిలబడాల్సిన అవసరం లేదు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగానికి దీశీం అయిన జష్ట్రఅవట ూవఎతీమ్ఖతీఎ, ూశీశ్రీఱఎవ వ్యవస్థకు దీశీం అయిన DGP కి VIP సీట్లలో కూర్చోబెట్టి వారికి తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి గారిపైనా, రాజకీయ పార్టీలపైనా, నాయకులపైనా, ప్రజలపై ఎంతైనా ఉంది.ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఏ కార్యక్రమంలో పాల్గొన్నా వారికి ఇవ్వాల్సిన మర్యాద, గౌరవం వారికి ఇవ్వాలి. వ్యవస్థలను సక్రమంగా వాడుకోవాలి అని లేబర్ పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ ఎం దశరథ నాయక్ ఉద్బోధించారు

# నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కొరడా!

## - అనుమతులు లేని కాలేజీల మూసివేత..

## - అధిక ఫీజులు, సర్టిఫికెట్ల నిలిపివేతపై చర్యలు తీసుకోవాలి



హనుమకొండ, సెప్టెంబర్ 19, హైదరాబాద్ ఎస్టేట్: ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను వెంటనే మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ, కనీస మౌలిక వసతులు కల్పించని యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆర్థిక భారం మోపుతున్నాయని కిరణ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ కోరారు. సర్టిఫికెట్ల నిలిపివేతతో విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్టిఫికెట్లను వెంటనే అందజేయాలని, అధిక ఫీజుల వసూళ్లు, నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, ఎండీ ఇస్మాయిల్, బొచ్చు ఈశ్వర్, పవన్‌కుమార్, సాల్మన్‌రాజ్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







